నమస్తే తెలంగాణ
వికారాబాద్
6 | హైదరాబాద్, ఆదివారం 7 జనవరి 2024 | VIKARABAD

డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జనవరి 6 : వికారాబాద్ జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తన చాంబర్ లో శనివారం సమావేశం నిర్వహించి డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడుదల చేసిన ఎలక్టోరల్ డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో ఏమైనా ఆక్షేపణలు, అభ్యంతరాలు ఉంటే ఈ నెల 22వ తేదీ వరకు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది ఓటరు జాబితాను ఫిబ్రవరి 8వ తేదీన ప్రకటిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల ప్రతినిధులకు డ్రాఫ్ట్ ఓటరు జాబితాను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వీటీజీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రాంతీయ సమన్వయాధికారి డాక్టర్ శారద

వికారాబాద్, జనవరి 6 : ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు జనవరి 20 వరకు వీటీజీ సెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రాంతీయ సమన్వయాధికారి డాక్టర్ శారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాల కోసం 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకై నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. దరఖాస్తు గడువు తేదీని జనవరి 20 వరకు పొడిగించిందని, ఇందుకు నాలుగో తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, ఒక ఫోన్ నెంబర్‌తో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారని తెలిపారు. ఎంపికకు పాత జిల్లా ఒక యూనిట్‌గా పరిగణిస్తారని, ఈ ఏడాది నాలుగో తరగతి చదువుతున్నట్లుగా బోనఫైడ్/స్టడీ సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయాలని వివరించారు. వెబ్‌సైట్ tgcet.cgg.gov.in లో పూర్తి వివరాలు పొందుపర్చామన్నారు.

రంజిత్‌రెడ్డిని గెలిపించుకుందాం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

తరిగోపులలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు, జనవరి 6 : పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీగా డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలుపించుకుందామని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం ధారూరు మండల పరిధి నాగసాన్‌పల్లి, తరిగోపుల గ్రామాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. గత నెలలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఓడినందుకు నిరాశ చెందొద్దన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా రంజిత్ అన్నను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ధారూరు మండల అధ్యక్షుడు రాజూనాయక్, మండల మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు వెంకటయ్య, దేవేందర్, వెంకట్‌రామ్‌రెడ్డి, రవికుమార్, యాదయ్య, శ్రీనివాస్, వెంకటయ్య, యాదయ్యయాదవ్ ఉన్నారు.

గణిత సామర్థ్యాలను నేర్పించాలి

ఎంఈవో హరిశ్చందర్

దోమ, జనవరి 6 : విద్యార్థులకు కనీస గణిత సామర్థ్యాలను నేర్పి అర్థవంతమైన బోధన అందించే దిశగా కృషి చేయాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. శనివారం మండల పరధిలోని కిష్టాపూర్, దాదాపూర్, బొంపల్లి కాంప్లెక్స్ పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా యూ-డైస్ పూర్తి చేసి పంపాలని తెలుపుతూ ఎఫ్ఎల్ఎన్‌లో అన్ని సామర్థ్యాలు సాధించాలని, ఎఫ్ఏ3 మార్కులను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిష్టాపూర్‌లో ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈవో హరిశ్చందర్

దరఖాస్తుల వెల్లువ

పరిగి, జనవరి 6 : ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణకు డిసెంబర్ 28 నుంచి ప్రారంభమైన ప్రజాపాలన కార్యక్రమం శనివారం ముగిసింది. డిసెంబర్ 28 నుంచి ఈనెల 6వ తేదీ శనివారం వరకు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లాలో అభయహస్తం కింద 2,74,470 దరఖాస్తులు అందగా, ఇతర దరఖాస్తులు 39,620 దరఖాస్తులు అందాయి. రెండు సెలవు రోజులను మినహాయించి 8 పనిదినాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించారు. వికారాబాద్ జిల్లా పరిధిలో 19 మండలాల్లో 566 గ్రామపంచాయతీలు, 4 మున్సిపాలిటీలు ఉన్నాయి. 57 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయగా 668 గ్రామసభలు నిర్వహించారు. గ్రామపంచాయతీలకు కేటాయించిన రోజున గ్రామసభలు నిర్వహించగా, మున్సిపాలిటీలలోని వార్డుల్లో ప్రతి రోజూ ప్రత్యేక కౌంటర్ల ద్వారా దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు.

ధారూరు మండలంలోని కొండాపూర్‌కలాన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

మండలాల వారీగా దరఖాస్తులు..

మండలం	అభయహస్తం	ఇతర దరఖాస్తులు
బంట్వారం	6416	1823
బషీరాబాద్	14150	8
బొంరాస్‌పేట్	16365	1019
ధారూరు	11968	2076
దోమ	16078	574
దౌల్తాబాద్	14270	3690
కొడంగల్	11441	2191
కోట్‌పల్లి	6946	1843
కులకచర్ల	14193	3171
మర్పల్లి	15941	690
మోమిన్‌పేట్	13466	249
నవాబుపేట్	10362	1416
పరిగి	13865	2779
పెద్దేముల్	14261	3320
పూడూరు	14849	1325
తాండూరు	15283	4045
వికారాబాద్	9199	149
యాలాల	13159	94
కొడంగల్ మున్సిపాలిటీ	3414	1133
వికారాబాద్ మున్సిపాలిటీ	16555	3070
పరిగి మున్సిపాలిటీ	5224	1672
తాండూరు మున్సిపాలిటీ	17065	3283
మొత్తం	274470	39620

డేటా ఎంట్రీకి ప్రత్యేక బృందాలు..

ప్రజాపాలనలో భాగంగా వచ్చిన దరఖాస్తుల డేటాను వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు జిల్లాలో 57 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో 20 మంది కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. ప్రతి రోజూ రెండు షిఫ్టుల్లో పది మంది చొప్పున డేటా ఎంట్రీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. నమోదు చేసిన తర్వాత యూనిక్ నెంబర్‌ను రెడ్ పెన్‌తో దరఖాస్తు పై భాగంలో రాసి దరఖాస్తు చివరి భాగంలో ఎంట్రీ చేసిన ఆపరేటర్ పేరు, సంతకం చేయాలని కలెక్టర్ సూచించారు. వేగంగా డేటా ఎంట్రీ కోసం ఇంటర్నెట్ సదుపాయంతోపాటు నిరంతర విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 17 వరకు డేటా ఎంట్రీ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

నాందార్‌పూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్

పరిగిలో ఇస్తేమా షురూ..



ఇస్తేమాకు హాజరైన ముస్లింలు

పరిగి, జనవరి 6 : పరిగి మున్సిపాలిటీ పరిధిలోని న్యామత్‌నగర్‌లో శనివారం ఇస్తేమా ప్రారంభమైంది. ఇస్తేమాకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు కర్ణాటకలోని పలు ప్రాంతాల నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శుక్రవారం రాత్రి మొదలుకొని శనివారం ఉదయం వరకు వివిధ ప్రాంతాల నుంచి బస్సులు, ఇతర వాహనాల్లో ముస్లింలు ఇస్తేమాకు తరలివచ్చారు. ఆయా ప్రాంతాల వారి వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ సదుపాయం కల్పించారు. ఇస్తేమాకు హాజరైన వారికి వలంటీర్లు సేవలు అందజేశారు. శనివారం ఉదయం ప్రారంభమైన ఇస్తేమాలో పలువురి ప్రసంగాలతోపాటు ప్రార్థనలు చేశారు. ఇస్తేమా సోమవారం వరకు కొనసాగనున్నది. శనివారం ఇస్తేమా ప్రాంతంలో పోలీసు బందోబస్తును జిల్లా ఎస్పీ కోటిరెడ్డి పరిశీలించి పర్యవేక్షించారు. ఇస్తేమా ప్రాంతంలో సదుపాయాలను డీపీవో తరుణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఏర్పాట్లపై డీపీవో తరుణ్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

- 500 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ధారూరు సీఐ రామకృష్ణ

ధారూరు, జనవరి 6 : గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసిన ఘటన ధారూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శనివారం ధారూరు సీఐ రామకృష్ణ ధారూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సంతోష్‌కుమార్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ నెల 5న కోట్‌పల్లి ఎస్ఐ స్రవంతి, ఏఎస్ఐ అంజద్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వస్తుండగా వారిని తనిఖీ చేయగా వారి వద్ద 500గ్రాముల ఎండు గంజాయి లభించిందని తెలిపారు. వారు కర్ణాటక సరిహద్దులోని జీవన్ వర్ష గ్రామానికి చెందిన సుభాష్, అనిల్‌కుమార్ గంజాయిని బీదర్ నుంచి తెచ్చి సమీప గ్రామాల్లో ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న గంజాయి, ద్విచక్ర వాహనం, ఇద్దరినీ అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా, వినియోగించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 10 లోపు వాహనదారులు పెండింగ్ చలాన్లను క్లియర్ చేసుకోవాలన్నారు.

జిల్లా కోర్టు భవన సముదాయానికి కృషి

- శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సన్మానించిన బార్‌అసోసియేషన్ సభ్యులు
- వికారాబాద్‌లో జరిగిన స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొన్న స్పీకర్
- సమస్యలు పరిష్కరించాలని స్పీకర్‌కు వినతి పత్రం అందజేసిన అయ్యప్ప స్వాములు

ఇస్రో ప్రయోగాలు చేసిన విద్యార్థులను అభినందిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, జనవరి 6 : వికారాబాద్ జిల్లా కోర్టుకు స్థలం, భవన సముదాయానికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కోర్టు సముదాయంలోని బార్ అసోసియేషన్ నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి సభాపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు సన్మానించిన అనంతరం సభాపతి మాట్లాడుతూ తన దృష్టికొచ్చిన కోర్టుకు సంబంధించిన భూ సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. బార్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు జిల్లా కోర్టు సముదాయానికి పది ఎకరాల స్థలాన్ని కేటాయించేందుకు స్థల పరిశీలన చేపడతామన్నారు. జిల్లాలోని రోడ్ల నిర్మాణాలకు రూ.400 కోట్లు కేటాయించామన్నారు. గతంలోనే పర్యాటక అభివృద్ధికి రూ.225 కోట్ల నిధులు మంజూరు చేశామని, రూ.25 కోట్లతోనే పనులు చేపట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంజులార మేశ్, తెలంగాణ బార్ అసోసియేషన్ కౌన్సిల్ మెంబర్ అనంతసేన్ రెడ్డి, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, కార్యదర్శి ప్రశాంత్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు బస్వరాజ్, గోవర్ధన్ రెడ్డి, యాదవ రెడ్డి, సంపూర్ణ ఆనంద్, మాధవరెడ్డి, మహ్మద్ రఫీ, ఇతర న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వివేకానంద జయంతి వేడుకల్లో..

విద్యార్థులు బాగా చదువుకొని దేశానికి మంచి పేరు తేవాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్ యజ్ఞ ఫౌండేషన్ వివేకానంద గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలో భాగంగా 7వ నేషనల్ యూత్ డే కార్యక్రమాన్ని వికారాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి స్పీకర్, చంద్రయాన్-3 అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్పన ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ వికారాబాద్‌లో 7వ నేషనల్ యూత్ డే స్పేస్ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించడం సంతోషంగా ఉన్నదన్నారు. విద్యార్థులు బాగా చదివి శాస్త్రవేత్తలుగా మారి భారతదేశపు ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తెలియజేయాలని సూచించారు. చంద్రయాన్-3 అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్పన మాట్లాడుతూ.. దేశంలో సైన్స్ దినదినాభివృద్ధి సాధిస్తున్నదని, ప్రపంచ దేశాలు వెళ్లలేని సౌత్ పోల్‌పై చంద్రయాన్-3ని ల్యాండ్ చేశామన్నారు. యూత్ డేకు 20 పాఠశాలలు, 200 మంది ఉపాధ్యాయులు, దాదాపు 1300 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, యజ్ఞ ఫౌండేషన్ సభ్యుడు ఉజ్వల్‌రాజ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అయ్యప్ప స్వాముల వినతి

అయ్యప్పస్వామి భక్తుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని కోరుతూ, వికారాబాద్ పట్టణంలోని ఓ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను శనివారం అయ్యప్పస్వామి సేవా సమితి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను విన్నవించి వినతిపత్రాన్ని అందజేశారు. కేరళ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో కొన్ని వారాలుగా భక్తులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతున్నదన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు గంటల తరబడి క్యూలో వేచివుండాల్సిన పరిస్థితి ఉంటున్నదని విజ్ఞప్తి చేశారు. ఈ పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరలో స్వాములకు భోజనాలు నీటి వసతులు కల్పించేలా చూడాలన్నారు. పోలీస్ సిబ్బందిని పెంచి మన తెలంగాణ నుంచి కూడా పోలీసులను పంపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

కొడంగల్ మండలంలోని బుల్కాపూర్‌లో భూములను పరిశీలిస్తున్న రాణికుముదిని, కలెక్టర్ నారాయణరెడ్డి

బొంరాస్‌పేట/కొడంగల్, జనవరి 6 : రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న నైపుణ్య విశ్వవిద్యాలయానికి అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తించడానికి శనివారం బొంరాస్‌పేట, కొడంగల్ మండలాల్లోని ప్రభుత్వ భూములను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణికుముదిని, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, ఉపాధి కల్పన మరియు శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ నగేశ్, సాంకేతిక విద్య జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రెవెన్యూ ఏడీ రాంరెడ్డి శనివారం పరిశీలించారు. బొంరాస్‌పేటకు సమీపంలోని తాండూరు రోడ్డు పక్కన ఉన్న సర్వే నం.760, 691 భూములను పరిశీలించారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న రాణికుముదినికి కలెక్టర్ స్వాగతం పలికారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వారు ప్రభుత్వ భూములకు సంబంధించిన మ్యాపులను పరిశీలించి సర్వే అధికారులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ అభివృద్ధికి కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పేరుతో 'కడా'ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రెండు రోజుల కిందట కూడా కలెక్టర్ బొంరాస్‌పేటకు వచ్చి రెండు సర్వే నెంబర్లలోని భూములను పరిశీలించి వెళ్లారు. బొంరాస్‌పేట నుంచి కొడంగల్‌కు వెళ్లిన అధికారులు మండలంలోని బుల్కాపూర్‌లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. అనంతరం అక్కడి అధికారులతో సమావేశమై చర్చించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ దేవేందర్, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ రవిచారి ఉన్నారు.

టీపీజేఎంఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

కె.శ్రీనివాస్

వికారాబాద్, జనవరి 6 : తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా వికారాబాద్‌కు చెందిన కె.శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్ బండ్లగూడలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఉమ్మడి జిల్లా పూర్వ అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రైవేట్ జూనియర్ కళాశాలల పలు సమస్యలపై చర్చించారు. అనంతరం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్(వికారాబాద్), ప్రధాన కార్యదర్శిగా ఎం.ఇంద్రసేనారెడ్డి (మేడ్చల్ మల్కాజిగిరి), కోశాధికారిగా శ్రీను(రంగారెడ్డి), ఉపాధ్యక్షులుగా చంద్రకాంత్, ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శులగా ఎం.భాస్కర్, యు.సురేంద్రనాథ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా శశిధర రెడ్డి ఎన్నికయ్యారు. జిల్లా సలహాదారులుగా రంగారావు, ఎల్.ఎస్.ఎన్.మూర్తి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ(ఇ.సి) మెంబర్స్‌గా గౌరీసతీష్(రంగారెడ్డి), ఎ.రాజవర్ధన్ రెడ్డి(వికారాబాద్), జి.అమర్‌నాథ్‌రెడ్డి(మేడ్చల్ మల్కాజిగిరి)లను ఎంపిక చేశారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట, జనవరి 6 : తపస్ నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని దుద్యాల మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయం ఆవరణలో ఉన్నత పాఠశాల హెచ్ఎం నెహ్రూ చౌహాన్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో దుద్యాల మండల తపస్ అధ్యక్షుడు సిద్దు మల్లేశ్, కార్యదర్శి శంకరప్ప, తపస్ నాయకులు మల్లికార్జున్, వెంకటేశ్, శ్రీకాంత్, వెంకటయ్య, చంద్రకాంత్, దిలీప్, అశోక్, సక్కుబాయి, ప్రవంతి పాల్గొన్నారు.

10న పండుగ సాయన్న విగ్రహావిష్కరణ

కులకచర్ల, జనవరి 6 : ఇప్పాయిపల్లి గ్రామంలో పండుగల సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు గాదె రామయ్య తెలిపారు. కులకచర్ల మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామంలో అత్యధికంగా ముదిరాజ్‌లు ఉన్నారని ముదిరాజ్ కులస్తులు సంఘటితమై పండుగల సాయన్న విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్‌ముదిరాజ్ (విగ్రహదాత), మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, కులకచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్‌నాయక్, న్యాయవాది బాలముకుందం, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌ముదిరాజ్ పాల్గొననున్నట్లు తెలిపారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మోమిన్‌పేట, జనవరి 6 : ట్రాఫిక్ చలాన్ల రాయితీని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని మోమిన్‌పేట ఎస్సై విఠల్‌రెడ్డి సూచించారు. శనివారం విలేకరులతో ఎస్సై మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ చలాన్లకు రాయితీ కల్పించిందన్నారు. ఈ నెల 10వరకు రాయితీలో చలాన్లను కట్టుకోవచ్చన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులను వెబ్‌సైట్‌లో నమోదు చేయండి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

పరిగి, జనవరి 6 : ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల వివరాల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మున్సిపల్, మండల పరిషత్ కార్యాలయాలతోపాటు స్థానిక శ్రీసాయి డిగ్రీ, పీజీ కళాశాలలో కంప్యూటర్ ఆపరేటర్లతో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రజాపాలనలో భాగంగా డిసెంబర్ 28 నుంచి ఈనెల 6వరకు ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఎలాంటి తప్పులు దొర్లకుండా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. డాటా ఎంట్రీ ప్రక్రియను ఈ నెల 17 వరకు పూర్తి చేయాలన్నారు. ఎంట్రీ చేసిన తర్వాత దరఖాస్తులు గల్లంతు కాకుండా పూర్తి బాధ్యతతో భద్రపరచాలని చెప్పారు. ఫోన్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుల నంబర్లు పక్కాగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా చూడాలి

కొడంగల్, జనవరి 6: తప్పులు లేకుండా ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ 6 గ్యారెంటీల పథకాలను పొందేందుకు అర్జిదారులు చేసుకున్న దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించిన అనంతరం ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో 6 గ్యారెంటీలకు సంబంధించి మొత్తం 3,237 దరఖాస్తులు రాగా, రేషన్ కార్డుకు సంబంధించి 1,061 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్టు అధికారి జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రామ మందిరం అక్షింతలు

వికారాబాద్, జనవరి 6 : అయోధ్య శ్రీ రామ మందిరం నుంచి తెచ్చిన అక్షింతలను శనివారం వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడలో శ్రీరాముడి భక్తులు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలోని శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 దీపాలు వెలిగించి భక్తిని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో సుధాకర్, సంతోష్, అశోక్, శ్రీకాంత్, మహేశ్, మల్లేశం, రాజు, సంతోశ్, ఆకాశ్, యాదగిరి పాల్గొన్నారు.

కులకచర్ల మండలంలో..

కులకచర్ల, జనవరి 6 : మండలం పరిధిలోని ఘనాపూర్ గ్రామంలో హిందూఉత్సవ కమిటీ సభ్యులు గోపాల్, ఆంజనేయులు, రాంచంద్రయ్య, రాఘవేంద్రచారి, రాములు ఆధ్వర్యంలో అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. పీరంపల్లి గ్రామంలో వివిధ పార్టీల ఆధ్వర్యంలో అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, కొత్త బలిజ రాజు, బసప్ప, మల్లేశం, మురళికృష్ణ, బాలయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, కమ్మరి రమేశ్, శ్రీనివాస్, బక్కని శ్రీనివాస్, రమేశ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలి

యాలాల, జనవరి 6 : ఎల్లమ్మతల్లి కృపతో నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని పూజలు చేసినట్ల